ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
శనివారం, 17 అక్టోబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 57 | పేజీలు: 4 వెల: 5

## మెడికవర్ షేర్లపై సీఎం సమాధానం చెప్పాలి

- మూడు సంస్థల్లో షేర్ల వివరాలు బయటపెడతాం
- చర్చకు సిద్ధమా.. ఆధారాలతో మాట్లాడతాం
- మెడికవర్ విక్రయంపైనా స్పష్టత ఇవ్వాలి
- బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్

3



## విహారయాత్రలో విషాదం..

- ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఐదుగురు మహిళలు దుర్మరణం
- శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ గొల్లపల్లి జలాశయం విషాద ఘటన
- మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ సంతాపం

3

# భర్తను చంపిన భార్య, ప్రియుడికి ఉరిశిక్ష

- గొంతు నులిమి హత్య.. మృతదేహం కింద పామును ఉంచి నాటకం
- ఫోన్ కాల్స్, పోస్టుమార్టంతో బయటపడిన అసలు విషయం
- నేరం రుజువు కావడంతో మరణదండన విధించిన మేరఠ్ కోర్టు
- ముగ్గురు పిల్లలున్నారంటూ భార్య వేడుకోలు
- మనుస్మృతిలోని శ్లోకాన్ని ప్రస్తావించిన న్యాయస్థానం



**కాకతీయ, నేషనల్ డెస్క్ :** భర్తను హత్య చేసి, పాము కాటుతో మరణించినట్లు నమ్మించేందుకు ప్రయత్నించిన భార్య, ఆమె ప్రియుడికి ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్ కోర్టు మరణశిక్ష విధించింది. గతేడాది ఏప్రిల్‌లో జరిగిన ఈ ఘటనలో సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం ఇద్దరినీ దోషులుగా నిర్ధారించింది. నేరం జరిగిన తీరు, సాక్ష్యాల ఆధారంగా కేసును అరుదైనదిగా పరిగణించినట్లు సమాచారం. శిక్ష ఖరారు సందర్భంగా సమాజంలో నేరాలను అరికట్టేందుకు శిక్ష భయం అవసరమని పేర్కొంటూ మనుస్మృతిలోని శ్లోకాన్ని కోర్టు ప్రస్తావించింది.

........(తరువాయి 2లో)

## చేతులెత్తేసిన రేవంత్‌రెడ్డి

- కరువుపై ప్రభుత్వం అస్త్ర సన్యాసం
- ముందస్తు చర్యల్లో ప్రభుత్వం విఫలం
- రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు, బీమా కల్పించాలి
- యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణపై సమాధానం చెప్పాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శలు



3

## పర్మిషన్లు గోరంత.. తవ్వకాలు గుట్టంత!

- దామెర గుట్టలను కొల్లగొడుతున్న మెఘా!
- గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పేరుతో మట్టిని కొల్లగొడుతున్న సంస్థ
- దామెర గుట్టల్లో అక్రమంగా భారీ తవ్వకాలు
- 10వేల మెట్రిక్ టన్నుల మట్టి తరలింపునకు మాత్రమే తాత్కాలిక అనుమతి
- రూ.2.60 లక్షల సినరేజ్ రుసుముతో పర్మిట్ జారీ
- అనుమతుల పత్రాలకు.. క్షేత్రస్థాయి తవ్వకాలకు పొంతన ఎక్కడ?
- చూసీ చూడనట్లుగా మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు

# అనుమతుల మాటున అక్రమాలు



meil





**కాకతీయ, వరంగల్ బ్యూరో :** గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పేరుతో దామెర గుట్టల్లో జరుగుతున్న తవ్వకాలు ప్రకృతి సంపదకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. మెఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సాగుతున్న పనుల్లో అనుమతులు, క్షేత్రస్థాయి తవ్వకాల పరిమాణం మధ్య వ్యత్యాసంపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హనుమకొండ గనులు-భూగర్భ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం 2026 సెప్టెంబర్ 21న జారీ చేసిన తాత్కాలిక అనుమతి పత్రం ప్రకారం.. దామెర మండలం దామెర గ్రామంలోని సర్వే నంబర్ 393/పార్ట్‌లో 10,000 మెట్రిక్ టన్నుల కంకర తరలింపునకు మాత్రమే అనుమతి ఇచ్చారు. ఇందుకు రూ.2,60,000 సినరేజ్ రుసుము చెల్లించింది. అనుమతి గడువు సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 20, 2026 వరకు మాత్రమే. ఇచ్చిన మట్టి తవ్వకాలకు క్షేత్రస్థాయిలో జరిగిన తవ్వకాలకు ఏమాత్రం సంబంధం లేకుండా ఉండటం గమనార్హం. లక్షల క్యూబిక్ మీటర్ల మేర తవ్వకాలు జరిగినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో గుట్టల్లో జరిగిన తవ్వకాలను పరిశీలిస్తే ఈ అనుమానం కలగక మానదు. మెఘా కంపెనీ అక్రమ తవ్వకాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ మొత్తం వ్యవహారంపై మైనింగ్, రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టాలని ప్రజల నుంచి డిమాండ్ పెరుగుతోంది. అనుమతించిన పరిమాణం ఎంత? వాస్తవంగా ఎంత తవ్వారు? ఎంత తరలించారు? అనే లెక్కలను అధికారులు బయటపెట్టాలని కోరుతున్నారు. పర్మిట్ జారీ చేసిన శాఖే క్షేత్రస్థాయిలో కొలతలు, రవాణా రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు.

**కొకొండ గుట్టలు ఖతం..**

**`ఇప్పుడు దామెర వంతా?**

గతంలో కొకొండ గుట్టల్లో మట్టి తవ్వకాల వ్యవహారాన్ని 'కాకతీయ' ఆధారాలతో వెలుగులోకి తెచ్చిన విషయం పాఠకులకు విదితమే. కాకతీయ వరుస కథనాలతో మెఘా కంపెనీ అక్రమాలను బయట పెడుతూ.. మైనింగ్ శాఖ భారీ మొత్తంలో జరిమానా విధించింది. ఈ పరిణామం తర్వాత ఇప్పుడు దామెర గుట్టలపై మెఘా కృష్ణారెడ్డి

........(తరువాయి 2లో)

## కార్మిక బీమాలో రూ.200 కోట్ల కుంభకోణం!

- ట్రయల్ బ్లేజర్ సంస్థకు ఏటా రూ.346 కోట్లు ఎందుకు?
- బీమా చెల్లింపులకు అవసరమయ్యేది రూ.216 కోట్లేనన్న ప్రవీణ్‌కుమార్
- రూ.436 బదులు రూ.1,666 ప్రీమియం వసూలు చేస్తున్నారని విమర్శ
- ఇందిరమ్మ కుటుంబ బీమా పథకంలోనూ మరో రూ.1,000 కోట్లకు ప్రణాళిక
- బీమా చెల్లింపుల్లో లంచాలు.. నకిలీ పత్రాలతో సొమ్ము కాజేస్తున్నారని ఆరోపణ
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన



2

## రోహిత్ వేముల బిల్లు ముసాయిదా సిద్ధం చేయాలి

- విద్యార్థుల హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యం
- ఎస్సీ అభివృద్ధి శాఖ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం



3



# నర్సంపేట పగ్గాలు.. స్వప్నకే!

పెద్ది కుటుంబానికే బీఆర్ఎస్ ప్రాధాన్యం

### స్వప్నకు అండగా ఉంటామని అధిష్ఠానం భరోసా

- తెలంగాణ భవన్‌లో ఉమ్మడి వరంగల్ నేతలతో కేటీఆర్ సమావేశం
- కార్యక్రమాలను బట్టి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బాధ్యతలు..!
- తాత్కాలిక సమన్వయకర్తను ప్రకటించని అధిష్ఠానం
- కేటీఆర్ సంకేతాలతో నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పరిణామం
- నర్సంపేట రాజకీయాల్లో కొత్త ఆరంభం..!

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :**

వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ రాజకీయాలకు పెద్ది స్వప్న సుదర్శన్‌రెడ్డే కీలక కేంద్రంగా ఉండబోతున్నారా? తెలంగాణ భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో జరిగిన సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన సంకేతాలు ఈ ప్రశ్నకు బలాన్నిస్తున్నాయి. దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇవ్వడంతోపాటు, స్వప్నను తన పక్కన కూర్చోబెట్టుకుని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. నియోజకవర్గంలో పెద్ది కుటుంబం పాత్ర కొనసాగుతుందనే సందేశాన్ని కేటీఆర్ బహిరంగంగా ఇచ్చినట్లు సమావేశ పరిణామాలు సూచిస్తున్నాయి. తాత్కాలిక సమన్వయకర్తను ప్రకటించకపోయినా, కార్యక్రమాల

........(తరువాయి 2లో)

## హైదరాబాద్‌లో హ్యుందాయ్ ప్లాంట్ పెట్టండి!

- సంస్థ యాజమాన్యానికి సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- జహీరాబాద్‌లో రూ.8,528 కోట్లతో గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రం
- 678 ఎకరాల్లో ప్రాజెక్టు.. 4,276 మందికి ఉద్యోగాలు
- త్వరలోనే భూమిపూజకు సిద్ధం
- పెండింగ్ అనుమతులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశం
- తెలంగాణలో తయారీ రంగానికి పూర్తి సహకారం : సీఎం



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్‌ను కార్ల తయారీకి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు హ్యుందాయ్ సంస్థ ముందుకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలో కార్ల తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సంస్థ యాజమాన్యాన్ని కోరారు. తెలంగాణలో తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ.8,528 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న హ్యుందాయ్ గ్లోబల్ పరిశోధన, అభివృద్ధి కేంద్రానికి సంబంధించిన పెండింగ్ అనుమతులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

........(తరువాయి 2లో)

## సింగరేణిని సంక్షోభంలోకి నెట్టింది ఆ రెండు పార్టీలే!

- బొగ్గు దొంగతనం జరగలేదు.. బుక్ అడ్జస్ట్‌మెంట్‌లోనే తప్పిదం
- రూ.60 వేల కోట్లకు చేరిన బకాయిలు
- కార్మికుల కష్టార్జితాన్ని ఎందుకు చెల్లించడం లేదు?
- 15 ఏళ్ల తర్వాత మూడు కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించాం
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** సింగరేణి సంస్థను సంక్షోభంలోకి నెట్టింది గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలేనని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి విమర్శించారు. సింగరేణి థర్మల్ విద్యుత్, బొగ్గును రాష్ట్ర విద్యుత్ సంస్థలు

........(తరువాయి 2లో)



# అనుమతుల మాటున అక్రమాలు

(మొదటిపేజీ తరువాయి)

కంపెనీ కన్ను పడింది. గత కొద్ది రోజులుగా నిర్విరామంగా..నిబంధనలకు పాతర వేస్తూ దామెర గుట్టల్లోనూ భారీ తవ్వకాలు కొనసాగుతుండటం గమనార్హం. గుట్టలను తవ్వేసిన తర్వాత లెక్కలు చూసుకోవడం కాదు.. తవ్వకాలు జరుగుతున్నప్పుడే నిబంధనల అమలును పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులదే. కౌకొండ వ్యవహారంపై గతంలో వెలుగులోకి వచ్చిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలను వెల్లడించడంతోపాటు, దామెర గుట్టల్లో ప్రస్తుతం జరుగుతున్న తవ్వకాలపై సమగ్ర నివేదికను విడుదల చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



**రూ.2.60 లక్షల రుసుము చెల్లిస్తే సరిపోతుందా?**

మైనింగ్ శాఖ జారీ చేసిన పర్మిట్‌లో తవ్వకాలు, రవాణాకు సంబంధించిన పలు నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. గ్రావెల్‌ను రోడ్డు మార్గంలో తరలించాలని, చివరి విడత ఖనిజం తరలించిన వారం రోజుల్లోగా రవాణా వివరాలతో అనుమతి పత్రాన్ని శాఖకు తిరిగి సమర్పించాలని పేర్కొన్నారు. ఖనిజాన్ని తరలించే అన్ని దశల్లో అధికారులు తనిఖీలు చేసి పరిమాణాన్ని కొలిచేందుకు అనుమతిదారుడు సహకరించాలని కూడా నిబంధన విధించారు. విక్రయ పత్రాలు, కొలతల పరిశీలన ఆధారంగా సీగ్నియరేజ్ రుసుములో వ్యత్యాసం తేలితే అదనపు మొత్తాన్ని వసూలు చేసే అధికారం శాఖకు ఉంది. నిబంధనలు ఉల్లంఘిస్తే అనుమతిని ఉపసంహరించుకోవచ్చు లేదా రద్దు చేయవచ్చు. మరి ఈ నిబంధనల అమలుపై అధికారులు ఎన్ని తనిఖీలు నిర్వహించారు? ఎన్ని వాహనాల్లో కంకర తరలించారు? ప్రతి లోడుకు సంబంధించిన వివరాలు నమోదు చేశారా? అనుమతించిన పరిమాణం పూర్తయిన తర్వాత రవాణాను నిలిపివేశారా? చివరి విడత వివరాలతో పర్మిట్‌ను తిరిగి సమర్పించారా? అనే అంశాలపై రికార్డులు బయటపెట్టాలి. రూ.2.60 లక్షల రుసుము చెల్లించినంత మాత్రాన తవ్వకాలన్నీ నిబంధనల ప్రకారమే జరిగినట్లు కాదు. అనుమతించిన పరిమాణం, వాస్తవంగా తరలించిన ఖనిజం, చెల్లించిన రుసుముల మధ్య వ్యత్యాసాలను లెక్కలతో సహా వెల్లడించాలి. తవ్వకాల పరిమాణాన్ని క్షేత్రస్థాయిలో కొలవకుండా, రవాణా రికార్డులను తనిఖీ చేయకుండా ఉంటే పర్యవేక్షణ వ్యవస్థ ఎందుకు ఉన్నట్లు? అంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**మైనింగ్.. రెవెన్యూ.. పంచాయతీరాజ్.. ఏం చేస్తున్నాయి?**

దామెర గుట్టల్లో జరుగుతున్న తవ్వకాలపై మైనింగ్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల బాధ్యతను నిర్ధారించాల్సిన అవసరం ఉంది. అనుమతుల పరిధి, ఖనిజం పరిమాణం, రవాణా వివరాలను పరిశీలించాల్సిన బాధ్యత మైనింగ్ శాఖదైతే, సర్వే హద్దులు, భూమి స్వరూపం, తవ్వకాలకు గుర్తించిన ప్రాంతాన్ని నిర్ధారించడంలో రెవెన్యూ శాఖ రికార్డులు కీలకం. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి ముడిసరుకు సేకరిస్తున్నట్లయితే, దాని అవసరం, తరలింపు, వినియోగ వివరాలపై సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించాలి. పర్మిట్‌లో పేర్కొన్న సర్వే నంబర్ పరిధిలోనే తవ్వకాలు జరుగుతున్నాయా? భూమి హద్దులు దాటి పనులు సాగుతున్నాయా? వెలికితీసిన మట్టి, కంకర పరిమాణానికి లెక్కలు నిర్వహిస్తున్నారా? రవాణా చేసిన ముడిసరుకు ఎక్కడ వినియోగించారు? అనే అంశాలను అధికారులు తనిఖీ చేయాలి. రెవెన్యూ అధికారులు భూమి సరిహద్దులను చూపించడం వరకే పరిమితమవుతున్నారా? ఆ తర్వాత తవ్వకాలపై పర్యవేక్షణ ఎవరు చేస్తున్నారు? పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని నిర్మాణ పనులకు ముడిసరుకు వినియోగిస్తుంటే, ఆ శాఖ బాధ్యత ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాలి. ఒక శాఖ అనుమతులు ఇవ్వడం, మరో శాఖ భూమి వివరాలు చూపించడం, ఇంకో వ్యవస్థ నిర్మాణ పనులు చేపట్టడం పేరుతో బాధ్యతను ఒకరి నుంచి మరొకరికి బదిలీ చేయడానికి వీల్లేదు. మూడు శాఖల ఉన్నతాధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి, అనుమతులు, కొలతలు, రవాణా, వినియోగ వివరాలను సరిపోల్చాలి.

**మెఘా సంస్థ సమాధానం చెప్పాలి..**

దామెర గుట్టల్లో తవ్వకాల వ్యవహారంపై మెఘా సంస్థతోపాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. 10,000 మెట్రిక్ టన్నుల కంకర తరలింపునకు అనుమతి ఉన్నప్పుడు, వాస్తవంగా ఎంత మేరకు తవ్వకాలు జరిగాయి? అనుమతి గడువు ముగిసిన తర్వాత కూడా తరలింపులు కొనసాగాయా? అనుమతించిన పరిమాణానికి మించి ఖనిజం వెలికితీస్తే దానికి సంబంధించిన రుసుములు చెల్లించారా? అనే అంశాలను రికార్డులతో నిర్ధారించాలి. తవ్వకాల ప్రాంతం, లోతు, విస్తీర్ణాన్ని శాస్త్రీయంగా కొలిచి, వెలికితీసిన ఖనిజం పరిమాణాన్ని అంచనా వేయాలి. రవాణా చలాన్లు, తనిఖీ నివేదికలు, రుసుము చెల్లింపులు, పర్మిట్ తిరిగి సమర్పించిన వివరాలను పరిశీలించాలి. కౌకొండ గుట్టలపై గతంలో వెలుగులోకి వచ్చిన వ్యవహారంలో తీసుకున్న చర్యలను కూడా సమీక్షించాలి. అనుమతుల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. పర్యావరణానికి నష్టం వాటిల్లినట్లు తేలితే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలి. మెఘా సంస్థకు ప్రత్యేక మినహాయింపులు ఉన్నాయా? లేక ఇతర సంస్థలకు వర్తించే నిబంధనలే అమలవుతున్నాయా? అన్నది కూడా పారదర్శకంగా వెల్లడించాలి. అభివృద్ధి పనుల పేరుతో ప్రకృతి సంపదను ధ్వంసం చేసే పరిస్థితులు కొనసాగకూడదు. దామెర గుట్టల్లో జరిగిన తవ్వకాలపై పూర్తి లెక్కలు బయటపెట్టి, బాధ్యత ఎవరిదో నిర్ధారించాలి. అనుమతులు గోరంత.. తవ్వకాలు గుట్టంత అన్న వ్యవహారంలో వాస్తవాలను వెలికితీయడం మైనింగ్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారుల తక్షణ కర్తవ్యం.

# కార్మిక బీమాలో రూ.200 కోట్ల కుంభకోణం!

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** కార్మికుల బీమా సొమ్ములో అక్రమాలు జరుగుతున్నాయని, కార్మిక శాఖలో రూ.200 కోట్ల కుంభకోణం జరిగిందని, మరో రూ.1,000 కోట్ల వ్యవహారానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. పేద కార్మికుల సంక్షేమం కోసం వినియోగించాల్సిన నిధులను ప్రైవేటు సంస్థలకు అప్పగించి, అధిక మొత్తాలు చెల్లిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సమీపంలోని టి.అంజయ్య కార్మిక సంక్షేమ భవన్‌లో శుక్రవారం కార్మికుల సమక్షంలో నిర్వహించిన ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీమా వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల బీమా పథకానికి రూ.436 ప్రీమియం వసూలు చేస్తుండగా, తెలంగాణలో ఒక్కో కార్మికుడి పేరు మీద రూ.1,666 వసూలు చేస్తున్నారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఇంత భారీ వ్యత్యాసానికి కారణమేంటని ప్రశ్నించారు. కార్మిక శాఖ పరిధిలోని సంక్షేమ బోర్డును పక్కనపెట్టి, బీమా చెల్లింపుల బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు. పంజాబ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సంక్షేమ బోర్డుల ద్వారానే బీమా చెల్లింపులు జరుగుతున్నాయని, తెలంగాణలో మాత్రం ట్రయల్ బ్లేజర్ సంస్థకు బాధ్యతలు అప్పగించారని విమర్శించారు. కార్మికుల నుంచి అదనంగా వసూలవుతున్న సొమ్ము ఎవరి ఖాతాల్లోకి వెళ్తోందో తేల్చాలని డిమాండ్ చేశారు.

**రూ.216 కోట్ల అవసరానికి రూ.346 కోట్ల చెల్లింపులా?**

తెలంగాణలో సుమారు 15 లక్షల మంది కార్మికులు ఉన్నారని, ఏటా దాదాపు 7 వేల మరణాలు నమోదవుతున్నాయని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వీరిలో సుమారు 700 మరణాలు ప్రమాదాల వల్ల సంభవిస్తుండగా, మిగిలినవి సహజ మరణాలని పేర్కొన్నారు. బాధితులకు బీమా చెల్లింపులు చేయడానికి ఏడాదికి సుమారు రూ.216 కోట్లు అవసరమని, ప్రభుత్వం మాత్రం ట్రయల్ బ్లేజర్ సంస్థకు రూ.346 కోట్లు చెల్లిస్తోందని ఆరోపించారు. తన లెక్కల ప్రకారం సుమారు రూ.130 కోట్లు అదనంగా చెల్లిస్తున్నారని విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కార్మికులకు పారదర్శకంగా బీమా అమలు చేశామని, ప్రస్తుత ప్రభుత్వం ప్రమాద మరణాలకు రూ.10 లక్షలు, సహజ మరణాలకు రూ.2 లక్షల బీమా అందిస్తామని ప్రకటించినప్పటికీ అమలు తీరుపై అనేక అనుమానాలు ఉన్నాయని అన్నారు.

**కంపెనీల ఎంపిక వెనుక ఎవరున్నారు?**

ట్రయల్ బ్లేజర్ సంస్థకు గతంలో బోనాంజా అనే పేరు ఉండేదని, ఆ సంస్థ గత కార్యకలాపాలపై సమగ్రంగా పరిశీలించకుండానే బీమా చెల్లింపుల బాధ్యతలు అప్పగించారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ప్రమాద బీమా బాధ్యతలను హెచ్‌డీఎఫ్‌సీతో పాటు క్రెడిట్ యాక్సెస్ లైఫ్ కంపెనీకి అప్పగించినట్లు పేర్కొన్నారు. 2023లో స్థాపించినట్లు చెబుతున్న క్రెడిట్ యాక్సెస్ లైఫ్ కంపెనీ టర్నోవర్ రూ.200 కోట్లు మాత్రమే ఉండగా, ప్రభుత్వం ఆ సంస్థకు రూ.246 కోట్లు చెల్లించిందని ఆరోపించారు. ఈ చెల్లింపులకు సంబంధించిన వివరాలు, కంపెనీల ఎంపికకు అనుసరించిన విధానం, నిర్ణయానికి ఆధారమైన నోట్ ఫైల్‌ను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై సంబంధిత ప్రభుత్వ శాఖ వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

**బీమా కోసం లంచాలు అడుగుతున్నారని ఆరోపణ**

పెద్దపల్లి జిల్లాలో ట్రయల్ బ్లేజర్ సంస్థ ప్రతినిధిగా పేర్కొన్న రమేష్ అనే వ్యక్తి రూ.10 లక్షల బీమా చెల్లింపు కోసం రూ.లక్ష లంచం అడుగుతున్నారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఇలాంటి బ్రోకర్లు 33 జిల్లాల్లో ఉన్నారని, బీమా చెల్లింపుల కోసం లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. కార్మిక సంక్షేమ భవన్‌లో వెంకట్‌రెడ్డి అనే అధికారి అక్రమ చెల్లింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లిలోని సంస్థ ప్రతినిధులకు, సంక్షేమ భవన్‌లోని అధికారులకు మధ్య ఉన్న సంబంధాలపై విచారణ జరపాలని కోరారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల వివరణ, అధికారిక విచారణ వివరాలు ప్రెస్‌నోట్‌లో లేవు. రాష్ట్రంలో నకిలీ ఎఫ్ఐఆర్‌లు, మరణ ధ్రువపత్రాలు సృష్టించి బీమా సొమ్ము పొందిన ఘటనలు ఉన్నాయని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బతికున్నవారిని చనిపోయినట్లుగా చూపించి నిధులు కాజేశారని విమర్శించారు. పెద్దపల్లి జిల్లాలో ట్రయల్ బ్లేజర్ సంస్థ ప్రతినిధిగా పేర్కొన్న రమేష్ తన కుటుంబంలో ముగ్గురు మరణించినట్లు నకిలీ పత్రాలు సృష్టించి బీమా చెల్లింపులు పొందారని ఆరోపించారు. ఈ వ్యవహారాలపై ఎఫ్ఐఆర్‌లు, మరణ ధ్రువపత్రాలు, బీమా క్లెయిమ్‌లను పరిశీలించి నిజానిజాలు తేల్చాలని డిమాండ్ చేశారు.

**రేవంత్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి**

కార్మిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో ఈ వ్యవహారాలకు మార్గం ఏర్పడిందని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతిరెడ్డి పాత్రపైనా విచారణ జరగాలని, బోర్డులో సభ్యుడు కాకపోయినా ఆయన సూచించిన సంస్థకు అవకాశం ఇచ్చారన్న ఆరోపణలపై వాస్తవాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ ఈ వ్యవహారానికి బాధ్యత వహించాలని అన్నారు. ఇద్దరు అధికారులపై చర్యలతో సరిపెట్టకుండా, నిర్ణయాల్లో భాగస్వాములైన అధికారులు, సంస్థల ప్రతినిధులు సహా బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం బాధ్యతలను కూడా ప్రైవేటు సంస్థలకు అప్పగించి మరో రూ.1,000 కోట్ల కుంభకోణానికి ప్రణాళిక వేస్తున్నారని ఆరోపించారు. ఈ పథకం బాధ్యతలను ముఖ్యమంత్రి అల్లుడికి అప్పగిస్తారన్న ప్రచారంపైనా విచారణ జరగాలని అన్నారు. కార్మిక శాఖలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, ముందుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌లో హ్యుందాయ్ ప్లాంట్ పెట్టండి!

(మొదటిపేజీ తరువాయి)

హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యాన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. జహీరాబాద్‌లో ప్రతిపాదిత ప్రాజెక్టు పురోగతి, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చించింది. సంగారెడ్డి జిల్లాలోని జాతీయ పెట్టుబడులు, తయారీ మండలంలో 678 ఎకరాల్లో విడతలవారీగా సమీకృత గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 4,276 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

**త్వరలోనే భూమిపూజకు ఏర్పాట్లు**

జహీరాబాద్ ప్రాజెక్టు నిర్మాణానికి రాబోయే కొద్ది నెలల్లోనే భూమిపూజ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు హ్యుందాయ్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. పనులు వేగంగా ప్రారంభించేందుకు ప్రభుత్వ సహకారం కోరారు. దీనిపై స్పందించిన రేవంత్‌రెడ్డి, పెండింగ్‌లో ఉన్న అనుమతుల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు అమలుకు అవసరమైన సహకారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. హ్యుందాయ్ సంస్థకు హైదరాబాద్‌తో సుమారు రెండు దశాబ్దాల అనుబంధం ఉంది. హైటెక్ సిటీలోని కేంద్రం ద్వారా అధునాతన వాహన ఇంజినీరింగ్‌కు సంబంధించిన పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ సామర్థ్యాలను మరింత విస్తరించేలా జహీరాబాద్‌లో గ్లోబల్ ఆర్‌అండ్‌డీ, మెగా టెస్టింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. వాహనాల రూపకల్పన, పరీక్షలు, పనితీరు అంచనా, ధ్రువీకరణ, నాణ్యతా ప్రమాణాల పరిశీలనతోపాటు ఇంజినీరింగ్ ప్రక్రియలను మెరుగుపరిచేందుకు ఈ కేంద్రం ఉపయోగపడనుంది.

**తయారీ రంగానికి తెలంగాణ అనుకూలం**

తెలంగాణ భౌగోళికంగా దేశానికి మధ్యలో ఉండటం, హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు అందుబాటులో ఉండటం రాష్ట్రానికి అనుకూలమని సీఎం తెలిపారు. రహదారులు, రైల్వే మార్గాలు, విమానాశ్రయాలతోపాటు భవిష్యత్తులో ఓడరేవులకు వేగవంతమైన అనుసంధానం కల్పించే ప్రణాళికలు ఉన్నాయని వివరించారు. ప్రత్యేక మొబిలిటీ క్లస్టర్ల అభివృద్ధి, పెరి అర్బన్ రీజియన్ వంటి ప్రణాళికలతో వాహన తయారీ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సహకారం అందిస్తామని చెప్పారు. తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 2024 ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశంలో రాష్ట్ర ప్రతినిధి బృందం హ్యుందాయ్ ప్రతినిధులతో చర్చలు జరిపింది. అనంతరం 2025 జూన్‌లో హ్యుందాయ్ ఆర్‌అండ్‌డీ కేంద్రం ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి సౌకర్యాలతో భారీ శాటిలైట్ నగరంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సీఎం సంస్థ ప్రతినిధులకు వివరించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని హ్యుందాయ్ యాజమాన్యాన్ని ఆహ్వానించారు.

**తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములమవుతాం**

హైదరాబాద్‌ను అంతర్జాతీయ సాంకేతిక, అధునాతన ఇంజినీరింగ్ కేంద్రంగా మరింత బలోపేతం చేయాలన్న హ్యుందాయ్ లక్ష్యం తెలంగాణ రైజింగ్-2047 విజన్‌కు అనుగుణంగా ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యాన్ చో తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానంలో తమ సంస్థ భాగస్వామిగా కొనసాగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నర్సంపేట పగ్గాలు.. స్వప్నకే!

(మొదటిపేజీ తరువాయి)

అవసరాన్ని బట్టి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను భాగస్వాములను చేస్తామని చెప్పడం ద్వారా స్థానిక రాజకీయాలపై అధిష్ఠానం తన వ్యూహాన్ని వెల్లడించినట్లయింది.

**పెద్ది కుటుంబానికే ప్రాధాన్యం**

నర్సంపేటలో పార్టీ బాధ్యతలు ఎవరికి దక్కుతాయన్న చర్చకు తెలంగాణ భవన్ సమావేశం కీలక మలుపుగా మారింది. దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేసినట్లు సమాచారం. సమావేశంలో స్వప్నకు కల్పించిన ప్రాధాన్యం, కార్యకర్తలకు ఆమె అందుబాటులో ఉంటారని చెప్పిన మాటలు.. నియోజకవర్గంలో ఆమె పాత్రను బలపరిచే సంకేతాలుగా కనిపిస్తున్నాయి. నాయకత్వ బాధ్యతలపై స్పష్టమైన అధికారిక ఉత్తర్వులు వెలువడకపోయినా, రాజకీయంగా ఎవరి చుట్టూ పార్టీ కార్యాచరణ సాగనుందనే విషయంలో కేటీఆర్ ఒక దిశను సూచించినట్లు తెలుస్తోంది. స్వప్నను పక్కన కూర్చోబెట్టడం కేవలం మర్యాదకు సంబంధించిన అంశంగా కాకుండా, పార్టీ శ్రేణులకు ఇచ్చిన రాజకీయ సందేశంగా చర్చ జరుగుతోంది. నర్సంపేటలో పెద్ది కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని, దివంగత నేతతో కార్యకర్తలకు ఉన్న సంబంధాన్ని కొనసాగించాలనే ఆలోచన అధిష్ఠానం వైఖరిలో కనిపిస్తోంది.

**స్వప్నకు కీలక పాత్ర.. క్షేత్రస్థాయిలో బలోపేతమే లక్ష్యం**

నియోజకవర్గ రాజకీయాల్లో స్వప్నను కీలక పాత్రలో నిలబెట్టే ప్రయత్నంగా ఈ సమావేశాన్ని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా స్వప్నమ్మ అందుబాటులో ఉంటారని, వారికి అండగా నిలుస్తారని కేటీఆర్ చెప్పినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యల ద్వారా ఆమెకు కుటుంబ ప్రతినిధి హోదా మాత్రమే కాకుండా, పార్టీ శ్రేణులతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించే బాధ్యత కూడా ఉండబోతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్వప్న క్షేత్రస్థాయిలో చురుకుగా వ్యవహరిస్తే, పెద్ది సుదర్శన్‌రెడ్డితో అనుబంధం ఉన్న కార్యకర్తలను సమీకరించడం, స్థానిక నేతల మధ్య సమన్వయం పెంచడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం సాధ్యమవుతుందని అధిష్ఠానం భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా కీలక నేతల సమక్షంలో జరిగిన సమావేశం ద్వారా నర్సంపేటలో పెద్ది కుటుంబానికి పార్టీ మద్దతు కొనసాగుతుందనే సంకేతం బలంగా వెలువడింది. స్వప్నను పక్కన కూర్చోబెట్టడం, కార్యకర్తలకు ఆమె అండగా ఉంటారని చెప్పడం ద్వారా నియోజకవర్గ రాజకీయాల్లో ఆమె ప్రాధాన్యాన్ని కేటీఆర్ స్పష్టం చేసినట్లు కనిపిస్తోంది. ఈ పరిణామాలు స్వప్నకు కీలక పాత్ర ఉండబోతోందనే అంచనాలకు బలం చేకూరుస్తున్నాయి. మొత్తానికి, నర్సంపేటలో బీఆర్‌ఎస్ భవిష్యత్ కార్యాచరణకు పెద్ది స్వప్నను కేంద్రంగా ఉంచే దిశగా అధిష్ఠానం అడుగులు వేస్తోందనే అభిప్రాయం సమావేశం అనంతరం బలపడింది.

**సమన్వయకర్తపై ప్రకటన ఎందుకు లేదు?**

నర్సంపేటకు తాత్కాలిక సమన్వయకర్తను నియమిస్తారనే చర్చ ఉన్నప్పటికీ, తెలంగాణ భవన్ సమావేశంలో ఆ పేరును ప్రకటించలేదు. ఈ నిర్ణయం తక్షణ నియామకం కంటే, నియోజకవర్గంలో బాధ్యతలను అవసరాన్ని బట్టి పంచుకునే విధానానికి సంకేతమా అన్న చర్చ మొదలైంది. పార్టీ కార్యక్రమాలను బట్టి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతలను భాగస్వాములను చేస్తామని కేటీఆర్ చెప్పినట్లు సమాచారం. దీంతో నియోజకవర్గంలో స్వప్నకు ప్రాధాన్యం కొనసాగుతూనే, నిర్దిష్ట కార్యక్రమాల నిర్వహణకు ఇతర నాయకుల సహకారం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ఒక సమన్వయకర్తను ప్రకటించకుండా ఉండటం వల్ల పార్టీ యంత్రాంగం మొత్తం ఒకే వ్యక్తి చుట్టూ తిరగకుండా, అధిష్ఠానం మార్గదర్శకత్వంలో పనిచేసే వెసులుబాటు ఉంటుందనే విశ్లేషణ కూడా వినిపిస్తోంది.

**ఇతర నేతలకు పరోక్ష సందేశం**

వ్యక్తిగత సమావేశాలకు ఆస్కారం లేదని అధిష్ఠానం స్పష్టం చేసినట్లు వచ్చిన సమాచారం కూడా నర్సంపేట రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ నిర్ణయాలకు అనుగుణంగా సమష్టిగా పనిచేయాలని కేటీఆర్ సూచించినట్లు తెలుస్తోంది. నియోజకవర్గ బాధ్యతలపై ఎవరికి వారు ఆశలు పెట్టుకోవడం కంటే, పార్టీ నిర్దేశించిన కార్యాచరణలో భాగస్వాములు కావాలనే సందేశం ఈ వ్యాఖ్యల్లో కనిపిస్తోంది. నర్సంపేటలో బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేసి గులాబీ జెండా ఎగరేయడమే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఇచ్చే నిజమైన నివాళి అని కేటీఆర్ చెప్పినట్లు సమాచారం. 'పెద్దన్న' ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే ఆయనకు తగిన గౌరవమని పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. దీంతో సమావేశం కేవలం నియోజకవర్గ బాధ్యతల చర్చకే పరిమితం కాకుండా, పార్టీ శ్రేణులను భవిష్యత్ రాజకీయ కార్యాచరణకు సిద్ధం చేసే వేదికగా కూడా నిలిచింది. పెద్ది కుటుంబానికి మద్దతు ప్రకటించడం, స్వప్నను ముందుకు తీసుకురావడం, కార్యకర్తలతో ఆమె అనుసంధానాన్ని పెంచాలని సూచించడం.. ఈ మూడు అంశాలు ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయి. దివంగత నేతతో ఉన్న అనుబంధాన్ని రాజకీయంగా కొనసాగించాలంటే కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు, పార్టీ సంస్థాగత బలాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

# సింగరేణిని సంక్షోభంలోకి నెట్టింది ఆ రెండు పార్టీలే!

(మొదటిపేజీ తరువాయి)

వినియోగించుకుంటూ బిల్లులు చెల్లించడం లేదని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయే నాటికి సింగరేణికి రూ.26 వేల కోట్ల నుంచి రూ.29 వేల కోట్ల వరకు బకాయిలు ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవి రూ.59 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్లకు చేరాయని పేర్కొన్నారు. పథకాలకు నిధులు కేటాయిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం.. సింగరేణి కార్మికుల కష్టార్జితాన్ని ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ఆర్థిక పరిస్థితి దిగజారడానికి గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాలే కారణమని కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర విద్యుత్ అవసరాల కోసం సింగరేణి బొగ్గు, థర్మల్ విద్యుత్‌ను వినియోగించుకుంటున్నప్పటికీ, వాటికి సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడం సంస్థ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ.26 వేల కోట్ల నుంచి రూ.29 వేల కోట్ల వరకు బకాయిలు పెట్టి వెళ్లిందని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని రూ.59 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్లకు పెంచిందని విమర్శించారు. సింగరేణి కార్మికులు చెమటోడ్చి పనిచేసి సంస్థకు ఆదాయం సమకూరుస్తుంటే, వారి శ్రమకు సంబంధించిన బకాయిలను చెల్లించకపోవడం ఏమిటని నిలదీశారు.

**46 లక్షల టన్నుల బొగ్గు మాయంపై వివరణ**

సింగరేణిలో 46 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందంటూ జరుగుతున్న ప్రచారంపైనా కిషన్‌రెడ్డి స్పందించారు. బొగ్గు శాఖ మంత్రిగా, బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా వాస్తవాలనే చెబుతున్నానని పేర్కొంటూ, సింగరేణిలో బొగ్గు దొంగతనం జరగలేదని స్పష్టం చేశారు. అధికారుల పుస్తకాల్లో లెక్కల సర్దుబాటు సందర్భంగా తప్పిదం జరిగిందని ఆయన వివరించారు. ఈ వ్యవహారానికి సంబంధించి బాధ్యులైన అధికారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. బొగ్గు మాయమైందనే ప్రచారం, దానికి సంబంధించిన లెక్కల వ్యవహారంపై రాజకీయ నాయకులు పరస్పరం విమర్శలు చేసుకోవడం కంటే వాస్తవాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. సింగరేణి బొగ్గు వ్యవహారాన్ని రేవంత్‌రెడ్డి, కేటీఆర్ రాజకీయ విమర్శలకు ఉపయోగించుకుంటున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటూ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సింగరేణి సంస్థ ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు, బకాయిల భారం, కార్మికుల ప్రయోజనాలు ప్రధాన చర్చాంశాలుగా ఉండాలని పేర్కొన్నారు. సంస్థకు రావాల్సిన బకాయిలు పేరుకుపోతున్న సమయంలో ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలని అన్నారు. సింగరేణి మనుగడనే ప్రశ్నార్థకంగా మార్చిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు కార్మికుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని వ్యాఖ్యానించారు.

**15 ఏళ్ల తర్వాత మూడు బొగ్గు బ్లాకులు కేటాయించాం**

తాను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సింగరేణికి కొత్తగా మూడు బొగ్గు బ్లాకులను కేటాయించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. సుమారు 15 సంవత్సరాల తర్వాత ఈ కేటాయింపులు జరిగాయని పేర్కొన్నారు. మరో బొగ్గు బ్లాకును సింగరేణికి కేటాయించేందుకు కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. సంస్థ భవిష్యత్తుకు అవసరమైన బొగ్గు వనరులు అందుబాటులో ఉండేలా కేంద్రం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. సింగరేణి అభివృద్ధికి, ఉత్పత్తి సామర్థ్యం పెంపునకు అవసరమైన అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. సింగరేణిలో ఉత్పత్తి తగ్గడంతో యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గు సరఫరాలో ఇబ్బందులు తలెత్తినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనతో ఫోన్‌లో మాట్లాడారని కిషన్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత ఏర్పడకుండా కోల్ ఇండియా నుంచి బొగ్గు కేటాయించాలని ముఖ్యమంత్రి కోరినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని యాదాద్రి ప్లాంట్‌కు బొగ్గు సరఫరా చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని, మహానది కోల్‌ఫీల్డ్స్ లేదా వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ నుంచి బొగ్గు సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

**విద్యుత్ డిమాండ్ పెరుగుదలతో బొగ్గుపై ఒత్తిడి**

ఎల్‌నినో పరిస్థితుల కారణంగా దేశవ్యాప్తంగా జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గిందని, మరోవైపు విద్యుత్ డిమాండ్ 16 నుంచి 18 శాతం పెరిగిందని కిషన్‌రెడ్డి తెలిపారు. దీంతో థర్మల్ విద్యుత్‌పై ఆధారపడటం పెరిగిందని చెప్పారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా, విద్యుత్ కేంద్రాల్లో నిల్వలపై కేంద్ర ప్రభుత్వం నిరంతరం సమీక్ష నిర్వహిస్తోందన్నారు. బొగ్గు సరఫరాను వేగవంతం చేసేందుకు రైల్వే రేక్స్ లోడింగ్‌ను పెంచినట్లు వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాలకు అతీతంగా రాష్ట్రానికి అవసరమైన విద్యుత్ సరఫరాకు సహకరించాలని పేర్కొన్నారు. సింగరేణి బకాయిల చెల్లింపు, సంస్థ ఆర్థిక బలోపేతం, కార్మికుల ప్రయోజనాల పరిరక్షణపై ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించాలని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# భర్తను చంపిన భార్య, ప్రియుడికి ఉరిశిక్ష

(మొదటిపేజీ తరువాయి)



మేరఠ్ జిల్లాలోని అక్బర్‌పూర్ సదాత్ గ్రామానికి చెందిన అమిత్ కశ్యప్ భార్య రవితకు, అమిత్ స్నేహితుడు అమర్‌దీప్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం అమిత్‌కు తెలియడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో అమిత్‌ను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న రవిత, అమర్‌దీప్‌తో కలిసి అతడిని హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిద్రిస్తున్న అమిత్ గొంతు నులిమి చంపిన అనంతరం, అనుమానం రాకుండా ఉండేందుకు పామును కొనుగోలు చేసి మృతదేహం కింద ఉంచినట్లు పోలీసులు గుర్తించారు. పాము కాటుతోనే అమిత్ చనిపోయాడని కుటుంబ సభ్యులను నమ్మించే ప్రయత్నం చేశారు. మృతదేహంపై పాము కాటు గుర్తులు కనిపించడంతో తొలుత ఈ ఘటన సహజ మరణంగా భావించే పరిస్థితి ఏర్పడింది.

**పోస్టుమార్టం.. ఫోన్ కాల్స్‌తో గుట్టురట్టు**

అమిత్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించడంతో కేసులో కీలక విషయం బయటపడింది. అతడు పాము కాటుతో కాకుండా ఊపిరాడక చనిపోయినట్లు వైద్య పరీక్షల్లో వెల్లడైంది. మృతుడి దుస్తుల్లో లభించిన పాము విషపూరితం కాదని తేలడంతో పోలీసులకు అనుమానాలు బలపడ్డాయి. రవిత, అమర్‌దీప్‌ల మధ్య జరిగిన 50కి పైగా ఫోన్ కాల్స్ వివరాలను పరిశీలించిన పోలీసులు, ఇతర సాక్ష్యాధారాలతో కలిసి కేసును ఛేదించారు. విచారణలో లభించిన ఆధారాలు, పోస్టుమార్టం నివేదికను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఇద్దరినీ దోషులుగా నిర్ధారించింది.

**మనుస్మృతిని ప్రస్తావించిన కోర్టు**

శిక్ష ఖరారు చేసే సమయంలో రవిత తనకు ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారని, కనికరం చూపాలని కోర్టును కోరినట్లు సమాచారం. అమర్‌దీప్ కూడా తనకు వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నారని పేర్కొన్నాడు. అయితే నేరం జరిగిన తీరు, సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఇద్దరికీ మరణశిక్ష విధించింది. భార్యను భర్తకు 'అర్ధాంగి'గా పరిగణించే సంప్రదాయాన్ని, భర్త ప్రాణాలను కాపాడేందుకు యముడితో వాదించిన పౌరాణిక పాత్ర సావిత్రిని కోర్టు ప్రస్తావించినట్లు కథనంలో పేర్కొన్నారు. శిక్ష భయం సమాజాన్ని నియంత్రిస్తుందని, శిక్ష లేకుంటే దుర్మార్గులు మంచివారిని హింసిస్తారని భావం వచ్చేలా మనుస్మృతిలోని శ్లోకాన్ని న్యాయస్థానం ఉటంకించింది. అమిత్ తల్లి మునేష్ దేవి తీర్పును స్వాగతిస్తూ, తమ కుటుంబం మొదటి నుంచీ మరణశిక్షనే కోరుకుందని, ఇప్పుడు న్యాయం జరిగిందని పేర్కొన్నట్లు సమాచారం.

**బ్లూ డ్రమ్ కేసులోనూ ఉరిశిక్ష**

మేరఠ్‌లోనే సంచలనం సృష్టించిన బ్లూ డ్రమ్ హత్య కేసులోనూ భార్య, ఆమె ప్రియుడికి మరణశిక్ష విధించినట్లు కథనంలో పేర్కొన్నారు. మర్చంట్ నేవీ అధికారి సౌరబ్ రాజ్‌పుత్‌ను ఆయన భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లా కలిసి గతేడాది మార్చిలో హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా నరికి, నీలిరంగు ప్లాస్టిక్ డ్రమ్‌లో ఉంచి సిమెంట్, ఇసుకతో నింపినట్లు పోలీసులు గుర్తించారు. డ్రమ్‌లో శరీర భాగాలు బయటపడటంతో ఘటన వెలుగులోకి వచ్చింది. సుమారు 13 నెలల విచారణ అనంతరం సెప్టెంబర్ 30న మేరఠ్ కోర్టు ముస్కాన్, సాహిల్ శుక్లాలను దోషులుగా నిర్ధారించింది. ఈ కేసులో 22 మంది సాక్షులను విచారించిన అనంతరం మరణశిక్ష విధించినట్లు అందించిన సమాచారం పేర్కొంటోంది.



# జీడబ్ల్యూఎంసీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- ఆటపాటలతో సందడి చేసిన మహిళా అధికారులు

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మహిళా ఉద్యోగులు, సిబ్బంది సంప్రదాయ పాటలు, ఆటలతో సందడి చేశారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్, కమిషనర్ టి.వెంకన్న దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ మహిళలు పాటలు పాడుతూ, లయబద్ధంగా నృత్యాలు చేశారు. దీంతో కార్యాలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా సుధారాణి, చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ఆత్మ గౌరవానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని అన్నారు. ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే ఈ పండుగ మహిళల ఐక్యత, ఆత్మగౌరవం, సామాజిక సమైక్యతకు ప్రతిబింబమని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని భావితరాలకు అందించాలని సూచించారు. కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ నగరంలో ప్రజలు పండుగను సంతోషంగా జరుపుకునేలా అవసరమైన సౌకర్యాలు, పరిశుభ్రత, రవాణా ఏర్పాట్లకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ మహిళా ఉద్యోగులు, సిబ్బంది, నగర మహిళలు పాల్గొన్నారు.

## ఆయుష్‌లో 10 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

**కాకతీయ, ములుగు:** ములుగు జిల్లాలో జాతీయ ఆయుష్ మిషన్ కింద 10 ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ సునీత తెలిపారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఎంపిక కమిటీ ద్వారా పొరుగు సేవల ప్రాతిపదికన నియామకాలు చేపడతామని పేర్కొన్నారు. నోటిఫికేషన్‌లో 4 ఆయుష్ వైద్యాధికారుల పోస్టులకు నెలకు రూ.40 వేలు, ఒక ఫార్మసిస్ట్‌కు రూ.15 వేలు, ఒక యోగా శిక్షకుడికి రూ.28 వేలు, 3 బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తల పోస్టులకు ఒక్కొక్కరికి రూ.15 వేల వేతనం నిర్ణయించారు. ఒక సైకోసోషియల్ కౌన్సిలర్‌కు ఒక్కో సందర్శనకు రూ.500 చొప్పున చెల్లిస్తారు. ఏడాదికి కనీసం 200 సందర్శనలు ఉంటాయి. 2026 జూలై 1 నాటికి అభ్యర్థుల వయస్సు 18-44 ఏళ్ల మధ్య ఉండాలి. అక్టోబర్ 19 నుంచి 31 వరకు ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. విద్యార్హతలు, అనుభవ ధ్రువపత్రాలు, ఫొటోతో కూడిన దరఖాస్తులను ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయ ఆయుష్ విభాగంలో స్వయంగా లేదా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా సమర్పించాలి. చివరి తేదీ సాయంత్రం 5 గంటల తర్వాత వచ్చిన దరఖాస్తులను స్వీకరించరు. పూర్తి వివరాలకు ములుగు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని డాక్టర్ సునీత సూచించారు.

# అధికారికంగా ఒకచోట.. ఆచరణలో మరో చోట

- గ్రామీణ వైద్యానికి తూట్లు పొడుస్తున్న వైనం
- సన్నూరు ఆసుపత్రి రాయపర్తికి తరలింపు
- సౌకర్యాల లేమా? అధికారుల సౌలభ్యమా?
- రోగుల కష్టాలకు బాధ్యులెవరు?
- ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

**కాకతీయ,రాయపర్తి :** గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా ఆయుర్వేద సాంప్రదాయ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ప్రభుత్వ ఆశయం అధికారుల అలసత్వంతో నీరుగారుతోంది.జాతీయ ఆయుష్ మిషన్(నామ్)కింద సన్నూరు గ్రామానికి మంజూరైన ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ అక్కడి నిరుపేదల ఆరోగ్య అవసరాలు తీర్చాలి. కానీ...నిబంధనలకు విరుద్ధంగా రాయపర్తి మండల కేంద్రంలో వైద్య సేవలు కొనసాగుతుండటంపై సన్నూరు గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి,ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రికార్డుల ప్రకారం ఒకచోట మంజూరైన ఆసుపత్రి,ఆచరణలో మాత్రం మరోచోట నడిపిస్తున్నారని ఆరోపిస్తున్నారు.ఆసుపత్రి భవనం గోడపై గ్రామం:సన్నూరు,మండలం:రాయపర్తి అని స్పష్టంగా రాసి ఉన్నప్పటికీ,సేవలు మాత్రం మండల కేంద్రానికి పరిమితం కావడం అధికారుల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది.ఈ క్రమంలో సన్నూరు గ్రామస్తులు,ముఖ్యంగా నిరుపేద రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజా ప్రయోజనాలు పక్కదారి?**

సాధారణంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు,ముఖ్యంగా నిరుపేదలకు ప్రాథమిక స్థాయిలోనే ప్రత్యామ్నాయ వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం నిర్దిష్ట గ్రామాలను ఎంపిక చేసి హెల్త్ సెంటర్లను మంజూరు చేస్తుంది.ఈ నేపథ్యంలోనే సన్నూరు గ్రామానికి ఈ ఆయుర్వేద వైద్యశాల కేటాయించబడింది.ఇదిలా ఉండగా... సన్నూరు ప్రజలకు అందించాల్సిన వైద్య ఫలాలను ఎవరి వెసులుబాటు కోసం,ఏ కారణాలతో మండల కేంద్రానికి తరలించారనే దానిపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.అధికారులు తమ రోజూవారీ రాకపోకల సౌలభ్యం కోసమే ఆస్పత్రిని ఏకంగా రాయపర్తికి తరలించారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**మందుల కోసం మండలానికి పరుగు..**

సన్నూరు గ్రామానికి చెందిన వృద్ధులు,కూలీలకు తిప్పలు తప్పడం లేదు.చిన్నపాటి కీళ్ల నొప్పులు,జ్వరం, దీర్ఘకాలిక సమస్యల కోసం ఆయుర్వేద మందులు పొందాలంటే మండల కేంద్రానికి పరిగెత్తాల్సి వస్తుందని కంటతడి పెడుతున్నారు.తీరా ఆస్పత్రికి వెళ్లేసరికి మేడం లీవ్ లో ఉన్నారు అంటూ... సిబ్బంది సమాధానం చెప్పడం నిత్యకృత్యంగా మారిందని రోగులు ఆరోపిస్తున్నారు.అనారోగ్యంతో బాధపడుతూ,కూలి పనులు మానేసి,ఆటో చార్జీలు భరించి ఆసుపత్రికి వెళ్లేసరికి వైద్యులు గైర్హాజరు కావడంతో ఖాళీ చేతులతో వెనదురగాల్సి వస్తుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వైద్యులు ఎప్పుడు ఉంటారో,ఎప్పుడు లీవ్ లో ఉంటారో తెలియక అయోమయానికి గురవుతున్నామని,అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని స్థానికులు మండిపడుతున్నారు. ఆయుష్ వైద్యాధికారి గజవెల్లి ఉషారాణిని వివరణ కోరగా.. సన్నూరు గ్రామంలో ఆసుపత్రి నిర్వహణకు సరిపడా సౌకర్యాలు ఉన్నా..సొంత భవనం లేకపోవడం వల్లే తాత్కాలికంగా రాయపర్తి కేంద్రానికి తరలించామన్నారు.గ్రామంలో భవనం లేదా స్థలం అందుబాటులోకి వచ్చిన వెంటనే ఆసుపత్రిని తిరిగి సన్నూరు గ్రామానికి తరలిస్తామని ఆమె తెలిపారు.

*** ఉన్నతాధికారులు స్పందించాలి...**

అధికారుల నిర్లక్ష్యంతో నిరుపేదలకు అందాల్సిన వైద్య ఫలాలు పక్క దారి పడుతున్నాయని,ఇప్పటికైనా జిల్లా కలెక్టర్,ఆయుష్ శాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి దీనిపై సమగ్ర విచారణ జరిపించాలి.తక్షణమే సన్నూరు గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ను పునరుద్ధరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.




# ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు!
- తాగునీటి సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలి
- మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్
- సమీక్ష సమావేశానికి సర్పంచులు గైర్హాజరుపై ఎమ్మెల్యే ఆగ్రహం




**కాకతీయ, కేసముద్రం:** ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ హెచ్చరించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కేసముద్రం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి కొందరు సర్పంచులు గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు నిర్వహించే సమావేశాలకు ప్రజాప్రతినిధులు బాధ్యతగా హాజరుకావాలని సూచించారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో రైతులకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని, ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని పేర్కొన్నారు.

**నిర్లక్ష్య అధికారులకు నియోజకవర్గంలో స్థానం లేదు**

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తున్నారని ఫిర్యాదులు తన దృష్టికి వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులకు తన నియోజకవర్గంలో స్థానం లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ మధుసూదన్, ఎంపీడీవో క్రాంతి కుమారి, తహసీల్దార్ వివేక్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేతులెత్తేసిన రేవంత్‌రెడ్డి

- కరువుపై ప్రభుత్వం అస్త్ర సన్యాసం
- ముందస్తు చర్యల్లో ప్రభుత్వం విఫలం
- రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు, బీమా కల్పించాలి
- యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణపై సమాధానం చెప్పాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శలు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** కరువు ముప్పుపై ముందుగానే హెచ్చరికలు వచ్చినా ముందస్తు చర్యలు చేపట్టడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. కరువును ఎదుర్కోలేనని సీఎం చేతులెత్తేశారని మండిపడ్డారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సాయం అందించడంతోపాటు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో తీవ్రమైన కరువు వచ్చే ప్రమాదముందని జనవరి నుంచే హెచ్చరికలు వచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదని కవిత ఆరోపించారు. ఆగస్టులో 28 శాతం లోటు వర్షపాతం నమోదైనప్పుడే అప్రమత్తమై ఉంటే పరిస్థితి మరోలా ఉండేదన్నారు. ఇతర రాష్ట్రాలు కరువు మండలాలను ప్రకటించి కేంద్రానికి నివేదికలు పంపినా తెలంగాణ ప్రభుత్వం ఆలస్యంగా స్పందిస్తోందని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయకపోవడం, మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల నీటి సమస్య తీవ్రత పెరిగిందన్నారు. వచ్చే వర్షాకాలంలోగా మేడిగడ్డ మరమ్మతులు పూర్తి చేసి గోదావరి జలాలను వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాన్ని విమర్శించడం మానేసి ప్రాజెక్టుల నిర్మాణంపై దృష్టి పెట్టాలని సూచించారు.

**రైతు కూలీలకు ఆర్థిక భరోసా కల్పించాలి**

యాసంగిలో సాగు తగ్గితే రైతులతోపాటు వ్యవసాయ కూలీలు ఉపాధి కోల్పోయి వలసలు వెళ్లే ప్రమాదం ఉందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు అందించడంతోపాటు వారి కుటుంబాలకు బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో పని దినాలు పెంచేందుకు కేంద్రంతో ముందుగానే చర్చలు జరపాల్సిందన్నారు. నవంబర్ నెలాఖరు వరకు రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా కొనసాగించాలని, అవసరమైతే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కలిసి సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. రాష్ట్రంలో కరువు, విద్యుత్ సమస్యలు నెలకొన్న సమయంలో యాదాద్రి పవర్ ప్లాంట్‌లోని కొన్ని విభాగాలను ప్రైవేటీకరించే ప్రయత్నం జరుగుతోందని కవిత ఆరోపించారు. పవర్ మ్యాక్స్ కంపెనీతో ప్రభుత్వానికి ఉన్న ఒప్పందాల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కొరతను ముందే అంచనా వేసి ఇతర రాష్ట్రాలతో ఒప్పందాలు చేసుకుని ఉంటే ప్రస్తుత సమస్యను నివారించవచ్చన్నారు. హైదరాబాద్‌లో నీటి కొరతకు చెరువుల ఆక్రమణలు కూడా కారణమని, చెరువుల పరిరక్షణపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు.

**అఖిలపక్ష సమావేశం ముందే నిర్వహించాల్సింది**

కరువు పరిస్థితులపై అఖిలపక్ష సమావేశాన్ని ముందుగానే నిర్వహించి ఉండాల్సిందని కవిత అన్నారు. ఇప్పుడు సమావేశం ఏర్పాటు చేస్తామనడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. కష్టకాలంలో రైతులకు తమ వంతు సహాయం అందిస్తామని, అదే సమయంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. విదేశీ బొగ్గు కొనుగోలు ఒప్పందాలపై విచారణ కోరుతూ కేటీఆర్ లేఖ రాయడంపై కవిత అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిమ శ్రీనివాస్‌రావుకు వ్యతిరేకంగా విచారణ కోరడం, గతంలో బీఆర్ఎస్‌కు అండగా నిలిచిన వారిని ఇబ్బందులకు గురిచేయడమేనని విమర్శించారు. సింగరేణి కార్మికుల సమస్యలపై బీఆర్ఎస్ నాయకత్వం దృష్టి పెట్టడం లేదని ఆరోపించారు. సింగరేణి ఎన్నికల్లో కార్మికుల కోసం పనిచేస్తున్న హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# మెడికవర్ షేర్లపై సీఎం సమాధానం చెప్పాలి

- మూడు సంస్థల్లో షేర్ల వివరాలు బయటపెడతాం
- చర్చకు సిద్ధమా.. ఆధారాలతో మాట్లాడతాం
- మెడికవర్ విక్రయంపైనా స్పష్టత ఇవ్వాలి
- బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్

**కాకతీయ, హైదరాబాద్ :** మెడికవర్ ఆసుపత్రి, మ్యాక్స్ బీఎన్ ఫార్మా, మైండ్ వాల్ట్ సంస్థల వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాటవేత ధోరణి అవలంబిస్తున్నారని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ విమర్శించారు. ఈ మూడు సంస్థల్లో రేవంత్‌రెడ్డి కుటుంబానికి సన్నిహితులుగా తాము పేర్కొంటున్న వ్యక్తులకు ఉన్న షేర్ల వివరాలను వెల్లడించారు. ఈ వ్యవహారంపై చర్చకు సిద్ధమా అని సీఎంను ప్రశ్నించారు. అన్నం శరత్‌రెడ్డికి మెడికవర్ ఆసుపత్రిలో 5,08,808 షేర్లు, మ్యాక్స్ బీఎన్ ఫార్మాలో 1,08,000 షేర్లు ఉన్నట్లు క్రిశాంక్ పేర్కొన్నారు. బ్రహ్మానందరెడ్డికి మెడికవర్‌లో 28,78,192, మైండ్ వాల్ట్‌లో 65,834 షేర్లు ఉన్నాయని తెలిపారు. దుంప శిరీష్‌రెడ్డికి మెడికవర్‌లో 46,46,596, మ్యాక్స్ బీఎన్ ఫార్మాలో 37 లక్షలు, మైండ్ వాల్ట్‌లో 1,97,500 షేర్లు ఉన్నట్లు వివరించారు. మ్యాక్స్ బీఎన్ ఫార్మాను సీఎం అల్లుడికి సంబంధించిన సంస్థగా, మైండ్ వాల్ట్‌ను సీఎం కుమార్తె నైమిషారెడ్డికి సంబంధించిన కార్పొరేట్ పాఠశాలల సంస్థగా ఆయన పేర్కొన్నారు. ఈ షేర్ల వివరాలు, సంస్థల మధ్య సంబంధాలపై ముఖ్యమంత్రి ప్రజలకు సమాధానం చెప్పాలని క్రిశాంక్ డిమాండ్ చేశారు. ఆధారాలతో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

**రూ.13,200 కోట్ల విక్రయంపైనా ప్రశ్నలు**

మెడికవర్ ఆసుపత్రి రూ.13,200 కోట్లకు అమ్ముడైన వ్యవహారంపై రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలని క్రిశాంక్ కోరారు. ఈ లావాదేవీపై ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతులు కష్టాల్లో ఉన్న సమయంలో ఆ మొత్తాన్ని రైతులకు పంచిపెట్టే ధైర్యం ముఖ్యమంత్రికి ఉందా అని ప్రశ్నించారు. ఈ మేరకు మన్నె క్రిశాంక్ ప్రకటన విడుదల చేశారు.

# రోహిత్ వేముల బిల్లు ముసాయిదా సిద్ధం చేయాలి

- విద్యార్థుల హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యం
- ఎస్సీ అభివృద్ధి శాఖ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం

**కాకతీయ, హైదరాబాద్ :** విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల హక్కులను పరిరక్షిస్తూ, కులం, సామాజిక నేపథ్యం ఆధారంగా వివక్షకు తావులేకుండా సమగ్ర చట్టాన్ని రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత రోహిత్ వేముల తెలంగాణ బిల్లు ప్రాథమిక ముసాయిదాను మూడు నెలల్లోగా సిద్ధం చేసి సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీకి సమర్పించాలని స్పష్టం చేశారు. శుక్రవారం తెలంగాణ సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సబ్ కమిటీ రెండో సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. బిల్లు రూపకల్పనకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ నేతృత్వం వహించాలని భట్టి విక్రమార్క సూచించారు. న్యాయశాఖను కమిటీలో సభ్య శాఖగా చేర్చడంతోపాటు విద్యాశాఖ, హోంశాఖ, విశ్వవిద్యాలయాల గ్రాంట్ల కమిషన్ తదితర సంస్థల భాగస్వామ్యాన్ని పరిశీలించాలని ఆదేశించారు. కమిటీని త్వరగా ఏర్పాటు చేసి ముసాయిదా తయారీ ప్రక్రియను ప్రారంభించాలని, నిర్ణీత గడువులోగా అన్ని దశలు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులు, అధ్యాపకులు, న్యాయ నిపుణులు, పౌర సమాజ సంస్థలు, విద్యారంగ నిపుణులతో సంప్రదింపులు జరిపేందుకు జాబితా రూపొందించాలని సూచించారు. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వివక్షకు సంబంధించిన అంశాలు, చట్టం అమలులో ఎదురయ్యే సవాళ్లను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. బిల్లు రూపకల్పనలో న్యాయపరమైన, సాంకేతిక అంశాలపై నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం సహకారం తీసుకోవాలని సమావేశంలో చర్చించారు. నిబంధనల రూపకల్పనలో సహకరించేందుకు నల్సార్ అంగీకరించినట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి వివరించారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడం, వివక్షను నిరోధించడం, విద్యాసంస్థల్లో న్యాయబద్ధమైన వాతావరణాన్ని బలోపేతం చేయడంపై చట్టంలో ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశం అభిప్రాయపడింది. మూడు నెలల్లో ప్రాథమిక ముసాయిదాను సిద్ధం చేసి తదుపరి పరిశీలనకు సమర్పించాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్, సీనియర్ ఐపీఎస్ అధికారి దేవేంద్ర సింగ్ చౌహాన్, ఐఏఎస్ అధికారులు యోగితా రాణా, విజయేంద్ర బోయి, న్యాయవాది దిశా వడేకర్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ డైరీ పాడి రైతులకు బోనస్ పంపిణీ

- దసరా పండుగ కానుకగా 64 మంది రైతులకు రూ.33,290 అందజేత

**కాకతీయ,శంకరపట్నం :** దసరా పండుగను పురస్కరించుకుని కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో కన్నాపూర్ గ్రామ పరిధిలోని పాడి రైతులకు శుక్రవారం బోనస్ పంపిణీ చేశారు. కరీంనగర్ డైరీ అధ్యక్షుడు గోపు వీరారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్హులైన 64 మంది డైరీ సభ్యులు, పాడి రైతులకు కలిపి మొత్తం రూ.33,290 బోనస్‌గా అందజేసినట్లు ఆయన తెలిపారు. పాడి రైతులను ప్రోత్సహించడంతో పాటు వారి సంక్షేమానికి డైరీ కృషి చేస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరీ డైరెక్టర్లు పిన్ రెడ్డి రాజిరెడ్డి, మహిపాల్ రెడ్డి, నాయిని నాగరాజు, నూనె ఐలయ్య, పిన్ రెడ్డి తిరుపతి రెడ్డి, పిన్ రెడ్డి శ్రీనివాస రెడ్డి, రెడ్డి కొమురయ్య, చుక్కల గట్టయ్య, నూనె అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## విహారయాత్రలో విషాదం..

- ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఐదుగురు మహిళలు దుర్మరణం
- శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ గొల్లపల్లి జలాశయం విషాద ఘటన
- మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ సంతాపం

**కాకతీయ, పెనుకొండ :** సరదాగా గడిపేందుకు గొల్లపల్లి జలాశయానికి వెళ్లిన ఐదుగురు మహిళలు నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన పట్టణాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మృతులంతా పెనుకొండ పట్టణంలోని దర్గాపేటకు చెందినవారిగా పోలీసులు గుర్తించారు. దర్గాపేటకు చెందిన గాయత్రమ్మ, ఆమె కుమార్తె అశ్విని, వారి స్నేహితులు పుష్పలత, షేక్ హసీనా, అత్తర్ మాహీ కలిసి గొల్లపల్లి జలాశయాన్ని సందర్శించేందుకు వెళ్లారు. జలాశయం వద్ద ప్రమాదవశాత్తు ఒకరి తర్వాత ఒకరు నీటిలో మునిగిపోయారు. ఈత రాకపోవడంతో ఐదుగురూ ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న స్థానికులు, బంధువులు జలాశయం వద్దకు చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఐదుగురు మహిళల మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గొల్లపల్లి జలాశయాన్ని సందర్శించేందుకు వెళ్లిన మహిళలు ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయారని, మత్స్యకారులు గుర్తించి మృతదేహాలను బయటకు తీశారని అధికారులు వివరించారు.

## రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యకల ఎల్లయ్య**



**కాకతీయ, చందుర్తి:** రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ చందుర్తి మండల అధ్యక్షుడు మ్యకల ఎల్లయ్య విమర్శించారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరెంట్ కోతలు, సాగునీటి కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొర విద్యుత్ సరఫరాతో మోటార్లు కాలిపోతూ, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతుబంధు కింద మూడు పంటలకు ఎకరాకు రూ.15 వేల చొప్పున ఇస్తామని, రైతుబీమా అమలు చేస్తామని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితులతో నీటి వనరులు అడుగంటుతున్న నేపథ్యంలో కాళేశ్వరం జలాలను ఎత్తిపోసి వేసవి పంటలకు సాగునీరు అందించాలని కోరారు. విద్యుత్ కోతలతో ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, వేసవి పంటలు వేయవద్దన్న ముఖ్యమంత్రి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వేములవాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఆధ్వర్యంలో రైతుల పక్షాన పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుర్గామాత మండపాలను సందర్శించిన సీపీ



**కాకతీయ, కరీంనగర్:** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సూచించారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ టౌన్ డివిజన్ పరిధిలోని గణేష్‌నగర్, హనుమాన్‌నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత పూజా మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులతో మాట్లాడి ఏర్పాట్లు, భద్రతా చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు పోలీసు శాఖ తరఫున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ యాదగిరి స్వామి, ఇన్‌స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, తిరుమల్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విదేశీయుల వివరాల నమోదు తప్పనిసరి

- 24 గంటల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత హెచ్చరిక



**కాకతీయ, వరంగల్:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విదేశీయులకు వసతి కల్పించే హోటళ్లు, హాస్టళ్లు, అద్దె గృహాల యజమానులు, విద్యా, వైద్య సంస్థల నిర్వాహకులు వారి రాకపోకల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ చట్టం-2025లోని సెక్షన్ 8 ప్రకారం విదేశీ పౌరులు, ఓసీఐ కార్డుదారులు, నేపాల్, భూటాన్ దేశస్థులు సహా విదేశీయులు వచ్చిన లేదా వెళ్లిన 24 గంటల్లోపు ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫారమ్-3 ద్వారా వివరాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశిత సమయంలో వివరాలు నమోదు చేయకపోతే చట్టంలోని సెక్షన్ 23(బి) ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని కమిషనర్ హెచ్చరించారు. వ్యక్తిగత లేదా వాణిజ్య వసతి నిర్వాహకులకు ప్రతి ఉల్లంఘనకు కనీసం రూ.50,000 జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. విద్యా, వైద్య సంస్థలకు కనీసం రూ.1,00,000 జరిమానాతో పాటు నేర విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## పండుగ వేళ గ్రామానికి కొత్త శోభ.. ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు

**కాకతీయ, చందుర్తి :** దసరా, సద్దుల బతుకమ్మ పండుగల సందర్భంగా చందుర్తి మండలం రామారావుపల్లి గ్రామంలో ప్రత్యేక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. సర్పంచ్ నారాగుల వాణి గంగస్వామి ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని వీధులతో పాటు బతుకమ్మ తెప్ప, చెరువు పరిసరాలను దీపాలతో అలంకరించారు. దీంతో గ్రామం రాత్రివేళ విద్యుత్ కాంతులతో కళకళలాడుతోంది. పండుగకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసిన సర్పంచ్‌ను గ్రామస్తులు అభినందించారు.

# మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

- పేద, నిరుద్యోగ మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్



**కాకతీయ, కేసముద్రం :** పేద, నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కేసముద్రంలో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ సామాజిక బాధ్యత నిధుల ద్వారా మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ చేతుల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. కుట్టు మిషన్లతో మహిళలు స్వయం ఉపాధి పొందుతూ కుటుంబ ఆదాయానికి తోడ్పడే అవకాశం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్, మున్సిపల్ కన్వీనర్ బోగోజు నాగేశ్వరచారి, సింగంశెట్టి మధుకర్, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలు శాసించే స్థాయికి ఎదగాలి : మంత్రి సీతక్క

- మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడిన మంత్రి సీతక్క



**కాకతీయ, ములుగు:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మంత్రి దనసరి అనసూయ సీతక్క మహిళా అధికారులు, ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. సంప్రదాయబద్ధంగా గౌరమ్మకు పూజలు చేసి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశయమని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. అనంతరం ములుగు మండలానికి చెందిన 25 మంది, మల్లంపల్లి మండలానికి చెందిన ఏడుగురు కలిపి మొత్తం 32 మంది లబ్ధిదారులకు రూ.32,03,712 విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు న్యాయం చేయాలి

- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు
- ఓదెల మండల గ్రామాల కమిటీ సభ్యులతో సమీక్ష



**కాకతీయ, ఓదెల:** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టి, అర్హులైన పేదలకు న్యాయం చేయాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సూచించారు. శుక్రవారం ఓదెల మండలం రూపునారాయణపేటలోని తన నివాసంలో మండలంలోని పలు గ్రామాల ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులతో లబ్ధిదారుల ఎంపికపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, అర్హులకు ప్రభుత్వ పథకం అందేలా కమిటీ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని సూచనలు చేశారు. ఎంపిక ప్రక్రియలో అర్హతలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీలపై కేసులకు ముందు సమగ్ర విచారణ చేయాలి

- మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పెరుమాండ్ల రామకృష్ణ



**కాకతీయ, హన్మకొండ :** ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వ్యక్తులపై కేసులు నమోదు చేసే ముందు వాస్తవ పరిస్థితులు, వారి ప్రమేయం, అందుబాటులో ఉన్న ఆధారాలను సమగ్రంగా పరిశీలించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డా. పెరుమాండ్ల రామకృష్ణ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో ఐపీఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అమాయకులు అనవసరంగా కేసుల్లో ఇరుక్కొని ఇబ్బందులు పడకుండా పూర్తి స్థాయి విచారణ అనంతరం చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై చంద్రశేఖర్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కేసుల్లో వాస్తవ పరిస్థితులను పరిశీలించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు రామకృష్ణ వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వి. నరేందర్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు దళితులు, గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కొంతమంది పోలీసు అధికారుల చర్యలతో ఆయా వర్గాల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతూ, నిష్పక్షపాత విచారణతో ఎవరికీ అన్యాయం జరగకుండా చూడాలని కోరారు.

# పత్తికి రూ.9,200.. మొక్కజొన్నకు రూ.2,900

- ధరలు పెరగడంతో రైతుల హర్షం



**కాకతీయ, కేసముద్రం:** కేసముద్రం ప్రాథమిక వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న, పత్తికి ప్రభుత్వ కనీస మద్దతు ధరకు మించి ధరలు పలికాయి. మొక్కజొన్న క్వింటాల్‌కు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2,400 కాగా, మార్కెట్‌లో రూ.2,900 ధర లభించింది. పత్తికి మద్దతు ధర రూ.8,667 ఉండగా, గరిష్ఠంగా రూ.9,200 పలికింది. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో సరైన వర్షాలు కురవక పంటల దిగుబడులు గణనీయంగా తగ్గాయని రైతులు పేర్కొన్నారు. దిగుబడులు తగ్గిన పరిస్థితుల్లోనూ మద్దతు ధరకు మించి ధరలు లభించడం కొంత ఊరటనిచ్చిందని హర్షం వ్యక్తం చేశారు.

# ఏనుమాములలో ధరల మోసం.. ఇద్దరి లైసెన్సులు రద్దు!

- 190 బస్తాల మిర్చి ధరలో భారీ వ్యత్యాసం
- బహిరంగ మార్కెట్లో రూ.34 వేలు.. రికార్డుల్లో సగానికి సగం తగ్గింపు
- మార్కెట్ ఫీజు ఎగవేతకు వ్యాపారుల యత్నం
- ఆధారాలతో 'కాకతీయ' కథనం.. పాలకవర్గం కీలక నిర్ణయం
- అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- మార్కెట్ చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో ధరల వ్యత్యాసం చూపిస్తూ మార్కెట్ ఫీజు ఎగవేతకు పాల్పడిన ఇద్దరు వ్యాపారుల లైసెన్సులను రద్దు చేస్తూ మార్కెట్ పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. 190 బస్తాల మిర్చికి బహిరంగ మార్కెట్లో రూ.34 వేల ధర పలికినా, రికార్డుల్లో మాత్రం సగానికి సగం తగ్గించి చూపిన వ్యవహారంపై 'ఉత్తరం కాకతీయ' సెప్టెంబర్ 25న ఆధారాలతో కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన మార్కెట్ పాలకవర్గం గురువారం సమావేశమై చర్యలకు నిర్ణయం తీసుకుంది. కోల్డ్ స్టోరేజీ నుంచి తరలించిన 190 బస్తాల మిర్చికి బహిరంగ మార్కెట్లో పలికిన ధరకు, రికార్డుల్లో చూపిన ధరకు భారీ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. 105 బస్తాలకు రూ.14,500, మరో 85 బస్తాలకు రూ.15,000గా నమోదు చేసినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. మొత్తం 190 బస్తాలకు మార్కెట్ ధర రూ.34 వేలు పలికినప్పటికీ, రికార్డుల్లో తక్కువ ధర చూపడం ద్వారా ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఒక శాతం మార్కెట్ ఫీజును ఎగవేసేందుకు ప్రయత్నించినట్లు మార్కెట్ పాలకవర్గం గుర్తించింది.

**ఇద్దరు వ్యాపారులపై చర్యలు**

ఈ వ్యవహారంలో దడవాయి కొమ్ము మురళి (లైసెన్స్ నంబరు 62), సత్యనారాయణ బజాజ్‌కు సంబంధించిన లైసెన్సులపై మార్కెట్ కమిటీ చర్యలు చేపట్టింది. సత్యనారాయణ బజాజ్, సురేష్ స్పైసెస్ ట్రేడింగ్ పేర్లతో వ్యవహారానికి సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చాయి. లైసెన్సుల రద్దుకు సంబంధించి అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్న పూర్తి వివరాలను మార్కెట్ కమిటీ వెల్లడించాల్సి ఉంది. ఏనుమాముల మార్కెట్‌లో ధరల వ్యత్యాసంతో జరుగుతున్న 'జీరో దందా'ను 'ఉత్తరం కాకతీయ' సెప్టెంబర్ 25న సాక్ష్యాధారాలు, స్టాక్ రిజిస్టర్ నకళ్లతో వెలుగులోకి తెచ్చింది. బహిరంగ మార్కెట్ ధరకు, వేబ్రిడ్జి స్లిప్పుల్లో చూపిన ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కథనంలో వివరించింది. ఈ కథనం మార్కెట్ వర్గాల్లో చర్చకు దారితీయడంతో పాలకవర్గం వ్యవహారాన్ని పరిశీలించినట్లు సమాచారం. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక అధ్యక్షతన గురువారం జరిగిన పాలకవర్గ సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. 'కాకతీయ' కథనంలో ప్రచురితమైన ఆధారాలను పరిశీలించిన అనంతరం సంబంధిత వ్యాపారుల లైసెన్సులపై చర్యలు తీసుకోవాలని తీర్మానించినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. రైతులకు నష్టం కలిగించేలా వ్యవహరించినా, మార్కెట్ కమిటీ ఆదాయానికి గండి కొట్టే ప్రయత్నం చేసినా ఉపేక్షించబోమని చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక హెచ్చరించారు. ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసినట్లు సమాచారం. మార్కెట్‌లో ధరల నమోదు, స్టాక్ వివరాలు, ఫీజుల వసూళ్లపై నిరంతర పర్యవేక్షణ అవసరమని ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది.







# పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి
- శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతర నిఘా
- వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ సఖ్వార్ ఆదేశం



**కాకతీయ, నల్లబెల్లి :** పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ సఖ్వార్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నల్లబెల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించిన డీసీపీ రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని, ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని డీసీపీ ఆదేశించారు. ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి, సకాలంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, పారదర్శకత పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రాంతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలపై నిరంతరం నిఘా ఉంచాలని, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పటిష్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని డీసీపీ పేర్కొన్నారు. గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరిగేలా పనిచేయాలని, నేరాల నియంత్రణకు ప్రాధాన్యమివ్వాలని దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీలో నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, నల్లబెల్లి సీఐ శంకర్రావు, ఎస్సై సాయి ప్రసన్నకుమార్‌తో పాటు ఖానాపురం, చిన్నగూడూరు, దుగ్గొండి పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బతుకమ్మ వేళ 109 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు

- 13 గ్రామాల్లో రూ.5.45 కోట్లతో ఇళ్ల నిర్మాణాలు
- అర్హులందరికీ విడతలవారీగా అవకాశం : మంత్రి సీతక్క



**కాకతీయ, ములుగు :** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బతుకమ్మ వేళ 109 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించడం సంతోషంగా ఉందని, వచ్చే ఏడాది లబ్ధిదారులు సొంతింట్లోనే బతుకమ్మ జరుపుకోవాలని ఆకాంక్షించారు. శుక్రవారం గోవిందరావుపేట రైతు వేదికలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి 13 గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేశారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.5.45 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ములుగు నియోజకవర్గంలో మొదటి విడతలో సుమారు 5 వేల ఇళ్లు మంజూరు చేశామని, తదుపరి విడతల్లోనూ అర్హులకు అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించి ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సీతక్క సూచించారు. పునాది పూర్తయిన తర్వాత బిల్లుల చెల్లింపులు ప్రారంభమవుతాయని, మహిళా సంఘాల ద్వారా ప్రారంభ ఖర్చులకు రూ.లక్ష రుణం పొందవచ్చని తెలిపారు. ఇసుక సరఫరాలో అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, సర్పంచులు లబ్ధిదారులకు సహకరించాలని కోరారు. కొత్త పింఛన్ల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలపై సీతక్క నిర్లక్ష్యం

- తాడ్వాయి సర్పంచ్ పట్ల వివక్ష చూపుతున్నారు
- విద్యుత్ కోతలతో ఎండుతున్న పంటలు
- మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి విమర్శలు



**కాకతీయ, ములుగు:** జిల్లాలో విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతూ పంటలు ఎండిపోతున్నా మంత్రి సీతక్క పట్టించుకోవడం లేదని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. శనివారం తాడ్వాయి మండలం మేడారంలో బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు దండుగుల మల్లయ్య నివాసంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడ్వాయి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఫంక్షన్ హాల్‌ను సమీపంలోని కామారం పంచాయతీకి బదిలీ చేయడం, స్థానిక సర్పంచ్ కొట్టెం ప్రవళికను ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించకపోవడం వివక్షాపూరిత వైఖరికి నిదర్శనమని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌కు తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వకుండా అవమానించడం సరికాదని పేర్కొన్నారు. సర్పంచ్ భర్తను అరెస్టు చేయడాన్ని కూడా ఆయన తప్పుబట్టారు. ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, స్థానిక ప్రజాప్రతినిధుల పట్ల వివక్ష లేకుండా వ్యవహరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్పంచ్ ప్రవళిక అరెస్టుపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం

- అరెస్టును తీవ్రంగా ఖండించిన లక్ష్మణ్‌బాబు, బడే నాగజ్యోతి





**కాకతీయ, ఏటూరునాగారం:** తాడ్వాయి సర్పంచ్ ప్రవళిక అరెస్టును బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు, ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదని విమర్శించారు. ప్రవళిక అరెస్టు విషయం తెలిసిన వెంటనే లక్ష్మణ్‌బాబు ఉన్నతాధికారులతో మాట్లాడి ఆమె విడుదలకు చొరవ తీసుకున్నారు. ప్రజల తరపున సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని బడే నాగజ్యోతి పేర్కొన్నారు. అరెస్టుకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని, ప్రవళికకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల హక్కులు, ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడేందుకు బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని ఇరువురు స్పష్టం చేశారు.

# ములుగులో బార్ కేటాయింపు పూర్తి

- ఒక్క బార్ కోసం 376 దరఖాస్తులు
- లక్కీ డ్రాలో 349వ టోకెన్ ఎంపిక



**కాకతీయ, ములుగు:** ములుగు మున్సిపాలిటీ పరిధిలో నూతన బార్ అండ్ రెస్టారెంట్ కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. ఒక్క బార్ కోసం 376 దరఖాస్తులు రాగా, శుక్రవారం నిర్వహించిన లక్కీ డ్రాలో 349వ టోకెన్ నంబరు గల దరఖాస్తుదారుడు ఎంపికైనట్లు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 41 బార్ల ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా, ములుగు మున్సిపాలిటీ పరిధిలో ఒక బార్ ఏర్పాటుకు అవకాశం కల్పించింది. ఈ కేటాయింపునకు సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 12 వరకు దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 376 దరఖాస్తులు అందడంతో శుక్రవారం లక్కీ డ్రా నిర్వహించి 349వ టోకెన్ నంబరు దరఖాస్తుదారుడిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కారోబార్ కుటుంబాన్ని మాజీ మంత్రి పరామర్శ

**కాకతీయ, పెద్దవంగర:** మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన కారోబార్ సోమనర్సయ్య, చిట్యాల గ్రామానికి చెందిన ఈదురు బీమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. శుక్రవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు రామచంద్రయ్య శర్మ, ఈదురు ఐలయ్య, సంజయ్, సుధాకర్, వెంకన్న, సమ్మయ్య, హరీష్, శ్రీను, బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు.

# పీఆర్‌టీయూ రాష్ట్ర శాఖలో నెల్లికుదురు ఉపాధ్యాయులకు చోటు

- రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా నలుగురి ఎంపిక
- రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఇద్దరికి అవకాశం




**కాకతీయ, నెల్లికుదురు:** పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర శాఖ ఎన్నికల్లో నెల్లికుదురు మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులకు పదవులు దక్కినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి బిక్షం గౌడ్, ప్రధాన కార్యదర్శి భట్టాపురం మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర శాఖలో వివిధ బాధ్యతలకు మండల ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా నైనాల గ్రామంలోని ఎంపీయూపీఎస్ ప్రధానోపాధ్యాయుడు భూసాని సోమయ్యతో పాటు కొత్త నరసింహారెడ్డి, బొమ్మరాతి సాయిలు, జలగం శ్రీనివాస్ ఎంపికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గొట్టిముక్కుల శ్రీనివాస్‌రెడ్డి, పెరుమాండ్ల రమేష్ నియమితులయ్యారు. రాష్ట్ర కార్యదర్శులుగా చాగంటి స్వామి, పెనుకుల రవీందర్, బోయిని రవీందర్, మామిడాల వెంకటేష్, తుమ్మ సతీష్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ ఎంపికలపై మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సహకరించిన జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌కు మండల శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# వ్యక్తిగత కక్షలతో వ్యక్తిపై గొడ్డలితో దాడి

- ముగ్గురిపై కేసు నమోదు చేసిన సీఐ విశ్వేశ్వర్

**కాకతీయ, గీసుగొండ :** వ్యక్తిగత కక్షలతో వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసిన ముగ్గురిపై గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ విశ్వేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. గీసుగొండ మండలం నందనాయక్ తండాకు చెందిన అజ్మీరా వెంకటేష్ (33) తమ గురించి చెడుగా ప్రచారం చేస్తున్నాడనే కక్షతో అదే గ్రామానికి చెందిన బూక్యా నాగరాజు, బూక్యా శంకర్, బూక్యా సింహాద్రి శుక్రవారం సాయంత్రం సుమారు 4.30 గంటల సమయంలో అతనితో గొడవకు దిగినట్లు తెలిపారు. ఈ క్రమంలో నిందితులు వెంకటేష్‌ను అసభ్య పదజాలంతో దూషించగా, బూక్యా నాగరాజు గొడ్డలితో అతని తలపై దాడి చేయడంతో గాయమై రక్తస్రావం జరిగినట్లు పేర్కొన్నారు. అనంతరం వెంకటేష్ భార్య అనుషను సైతం దూషించి, చేతులతో కొట్టి బెదిరించినట్లు బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బూక్యా నాగరాజు, బూక్యా శంకర్, బూక్యా సింహాద్రిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విశ్వేశ్వర్ తెలిపారు.

# చుంచుపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఐటీడీఏ పీఓ

- వైద్య సేవలు, మందుల నిల్వలపై సమీక్ష
- వ్యాక్సిన్ల భద్రత, రిఫ్రిజిరేటర్ నిర్వహణ పరిశీలన



**కాకతీయ, ఏటూరునాగారం:** ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం ములుగు జిల్లా మంగపేట మండలం చుంచుపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, పారిశుద్ధ్య పరిస్థితులు, మందుల నిల్వలను పరిశీలించారు. మందుల నిల్వలకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేసి, వ్యాక్సిన్ల భద్రత కోసం ఏర్పాటు చేసిన రిఫ్రిజిరేటర్ నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మందులు, వ్యాక్సిన్ల నిల్వల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at
H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266